

'గుంటూరు కారం' చిత్రంలో మహేష్‌బాబు



అనుఇమ్మాన్యుయేల్

# సర్‌ప్రైజ్‌గా ఫీలవుతారు!

'ఇప్పటివరకు రానటువంటి వినూత్న కథాంశంతో 'జపాన్' చిత్రాన్ని తెరకెక్కించారు. ఆద్యంతం చక్కటి వినోదంతో పాటు ఎమోషన్స్‌తో ఆకట్టుకుంటుంది' అని చెప్పింది అనూ ఇమ్మాన్యుయేల్. ఈ భామ కార్తి సరసన కథానాయికగా నటించిన 'జపాన్' చిత్రం ఈ నెల 10న విడుదలకానుంది. రాజు మురుగన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు నిర్మించారు. ఈ సందర్భంగా అనూ ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ 'ఈ కథ చెప్పినప్పుడే చాలా ఎక్సైయిటింగ్‌గా అనిపించింది. ఇలాంటి కథను గతంలో ఎప్పుడూ వినలేదు. ఎన్నో సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. కార్తి వంటి గొప్ప స్టార్‌తో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నా. సెట్‌లో ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా. ప్రతీ విషయంలో తన కోస్టార్స్‌కు మద్దతుగా నిలుస్తారు. ఈ దీపావళి సీజన్‌కు పర్‌ఫెక్ట్ మూవీగా 'జపాన్' చిత్రాన్ని చెప్పొచ్చు. నా పాత్రలో కూడా సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్ చాలా ఉంటాయి. అవేమిటో సినిమా చూస్తే తెలుసుకోవాలి. నటిగా డ్రీమ్ రోల్స్ అంటూ ఏమీ లేవు. ప్రేక్షకులు ఇష్టపడే పాత్రలు చేయాలనుకుంటున్నా' అని చెప్పింది.

# చూసినవారంతా స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు

కమల్‌హాసన్ 'నాయకుడు'(1987) సినిమాను తెలుగులో విడుదల చేసి, తొలి అడుగులోనే అభిరుచిని చాటుకున్నారు నిర్మాత రవికిశోర్. సింగీతం శ్రీనివాసరావు క్లాసిక్ 'పుష్పకవిమానము'(1988) చిత్రాన్ని కూడా ఈయనే తెలుగు ప్రేక్షకులకు అందించారు. నేరుగా రవికిశోర్ తీసిన సినిమాలు కూడా సామాన్యమైనవికావు. లేడీస్ టైలర్, మహర్షి, మావిచిగురు, ఎగిరేపావురమా, నువ్వేకావాలి, నువ్వునాకు నచ్చావ్, నువ్వే నువ్వే.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అద్భుతాలు. ఆయన నిర్మాణం నుంచి రానున్న మరో విభిన్న చిత్రం 'దీపావళి'. స్రవంతి రవికిశోర్ నిర్మించిన తొలి తమిళ చిత్రం 'కీడ'కు ఇది తెలుగు అనువాదం. పూరాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈచిత్రానికి దర్శకుడు ఆర్‌ఏ వెంకట్. ఈ నెల 11న ఈ సినిమా విడుదలకానుంది. ఈ సందర్భంగా రవికిశోర్ విలేకరులతో ముచ్చటించారు.

**తక్కువ సినిమాలు చేయడానికి కారణం అదే**

నిర్మాతగా 36ఏండ్ల నా ప్రయాణాన్ని చూస్తే గర్వంగా ఉంటుంది. ఇప్పటివరకూ బౌండ్ స్క్రిప్ట్ లేకుండా సినిమా చేయలేదు. ఇన్నాళ్ల వ్యవధిలో తక్కువ సినిమాలు చేయడానికీ కారణం అదే. 'కీడ' కథ నచ్చి నా అంతట నేను దర్శకుడు వెంకట్‌కి ఫోన్ చేశాను. తను వేరేవాళ్లతో కమిటయ్యానన్నాడు. అవకాశం ఉంటే చెప్పమన్నాను. అదృష్టం బావుండి చివరకు అది నా దగ్గరకే వచ్చింది. బౌండ్ స్క్రిప్ట్ రికార్డ్ చేసి పంపమని అడిగా. తను పంపాడు. విని ఓకే చేశా. ఇక ఏ రోజూ అతని పనిలో జోక్యం చేసుకోలేదు. ప్రాణంపెట్టి కథ రాసుకున్నాడు. ప్రాణం పెట్టి తీశాడు. అవసరమైన డబ్బుని మాత్రం ఏర్పాటు చేశా. విడుదలకు ముందే వివిధ చిత్రోత్సవాల్లో ఈ సినిమా ప్రదర్శించబడి విమర్శకుల ప్రశంసలందుకుంది.

**బలగం చూశాక నమ్మకం కుదిరింది**

మొదట తమిళంలోనే విడుదల చేయాలనుకున్నాం. కానీ కరోనా తర్వాత మన ప్రేక్షకులు అన్ని భాషలనూ ఆదరిస్తారని అర్థమైంది. ముఖ్యంగా 'బలగం' సినిమాకు వచ్చిన స్పందన చూశాక, 'దీపావళి'ని కూడా తెలుగు ప్రేక్షకులు బాగా ఆదరిస్తారని నమ్మకం కుదిరింది. ఇటీవలే ఈ సినిమా ప్రీమియర్ షో వేశాం. చూసిన వారంతా స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. రేపు థియేటర్లలో కూడా ఇలాంటి స్పందనే వస్తుందని నమ్మకంగా చెప్పగలను.



స్రవంతి రవికిషోర్



# ఉస్తాద్ వచ్చేది అప్పుడే..

పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాపై రకరకాల వార్తలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతూ వున్నాయి. దాంతో చిత్ర దర్శకుడు హరీశ్‌శంకర్ స్పందించక తప్పలేదు. ఓ నెటిజన్ అత్యుత్సాహంతో 'ఉస్తాద్ భగత్‌సింగ్' గురించి ఓ పోస్ట్ పెట్టాడు. ఇప్పటివరకూ 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ 20 రోజులు మాత్రమే జరిగిందని, జనవరి నుంచి దర్శకుడు హరీశ్‌శంకర్ రవితేజ సినిమా పనుల్లో బిజీ కానున్నారనేది ఆ పోస్ట్ సారాంశం. దీనిపై హరీశ్ తనదైన శైలిలో స్పందించారు. 'రెండు అప్‌డేట్లూ తప్పే.. ఈ ఆవేశమే తగ్గించుకుంటే మంచిది' అంటూ హరీశ్ ఎక్స్(ట్విటర్)ద్వారా స్పందించారు. ఇక 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా విషయానికొస్తే.. ఈ చిత్రానికి సంబంధించిన ముఖ్యమైన సన్నివేశాల చిత్రీకరణ పూర్తయింది. 'గబ్బర్‌సింగ్'ని మించే పవర్‌ఫుల్ పోలీస్‌గా ఇందులో పవన్‌కల్యాణ్ కనిపించనున్నాడని చిత్ర యూనిట్ చెబుతున్నారు. ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ స్వరాలందిస్తున్నారు. ఈ సినిమాను డిసెంబర్‌లోనే విడుదల చేయాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల రిత్యా వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల చేయడానికి చిత్ర నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి సన్నాహాలు చేస్తున్నారు.

# ధమ్ మసాలా బిర్యానీ

మహేష్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'గుంటూరు కారం' చిత్రం నిర్మాణం నుంచే అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. అతడు, ఖలేజా వంటి బ్లాక్‌బస్టర్ విజయాల తర్వాత త్రివిక్రమ్-మహేష్‌బాబు కాంబినేషన్‌లో వస్తున్న చిత్రమిదే కావడంతో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. సంక్రాంతి పర్వదినం సందర్భంగా విడుదలకానుంది. మంగళవారం దర్శకుడు త్రివిక్రమ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని 'ధమ్ మసాలా' గీతాన్ని విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రచించిన ఈ గీతాన్ని సంజిత్‌హెగ్డే, జ్యోతి నూరన్ ఆలపించారు. తమన్ స్వరకర్త. సరికొత్త ట్యూన్, మాస్ బీట్‌తో ఈ పాట ఆకట్టుకునేలా సాగింది. 'నా తలరాతే రంగుల రంగోలి, దిగులైనా చేస్తా దీవాళి. నా నవ్వుల కోటని నేనే ఎందుకు పడగొట్టాలి'..'నేనో నిశ్శబ్దం..అనునిత్యం నాతో నాకే యుద్ధం' వంటి చరణాలు హీరో స్వభావాన్ని ఆవిష్కరిసూ సాగాయి. శ్రీలీల, మీనాక్షి చౌదరి, జగపతిబాబు, జయరామ్, ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: త్రివిక్రమ్ శ్రీనివాస్.



# వైభవంగా సంతోషం పండగ

'ఈ నెల 18న హైదరాబాద్‌లో సంతోషం ఓటీటీ అవార్డ్స్, డిసెంబర్ 2న గోవాలో సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డ్స్ ఘనంగా నిర్వహించనున్నాం. సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పుకుంటున్నా' అన్నారు నిర్మాత సురేశ్ కొండేటి. ఆయన ప్రతి ఏడాదీ సంతోషం ఫిల్మ్ అవార్డుల వేడుక నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది నిర్వహించే వేడుక గురించి ఆయన విలేకరులతో ప్రత్యేకంగా మాట్లాడారు. 'పాతికేండ్లు ఈ వేడుక జరపాలనుకున్నాను. 22ఏండ్లు పూర్తయ్యాయి. ఇంకో మూడేండ్లు కచ్చితంగా చేస్తా. అగ్రనటులు చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్ ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఇంత సాధించగలిగాను. సురేశ్ ఫిలింఫేర్ స్థాయిలో అవార్డుల వేడుక నిర్వహించగలడని ఆనాడు నాగార్జున నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలనే కసితో కృషితో ఈ వేడుకను ఇన్నాళ్లూ ఘనంగా చేశాను. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయికి సంతోషం పండుగ ఎదిగింది. డిసెండర్ 2న గోవాలో జరుగనున్న వేడుకకు దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో సినీ కళాకారులు రానున్నారు. ప్రేక్షకులు వేలల్లో రాబోతున్నారు. ఆ డేట్‌కి ఫ్లయిట్ టికెట్లు కూడా దొరకని పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. సహకరిస్తున్న గోవా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా' అన్నారు సురేశ్ కొండేటి.



బన్నీ వాసు, తేజ, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ రాజశేఖర్

# నేరస్థుల్ని పట్టుకోవాల్సిన పోలీసులే కేసులో ఇరుక్కుంటే?


'ఈ సినిమా ఒరిజినల్ చూశాను. ఇందులో చాలా మార్పులు చేశారు. 'గన్ గవర్నమెంట్‌ది.. వేలు మనది' అన్న డైలాగ్ నాకు బాగా నచ్చింది. శ్రీకాంత్‌గారిని రియలిస్టిక్ క్యారెక్టర్‌లో చూసినందుకు ఆనందంగా ఉంది. వరలక్ష్మీ శరత్‌కుమార్, శివానీ రాజశేఖర్, రాహుల్ విజయ్ మంచి పాత్రల్లో కనిపించబోతున్నారు. అల్లు అరవింద్ ధోనీ లాంటి వారు. వెనుక ఆయన ఉన్నారు కాబట్టే బన్నీ వాసు, ఎస్‌కేఎన్ బాగా ఆడేస్తున్నారు. ఇప్పుడు విద్యాగారు వస్తున్నారు. ఆమె కూడా సక్సెస్ కావాలని కోరుకుంటున్నా' అన్నారు అనిల్ రావిపూడి. రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ జంటగా, శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలకపాత్రలు పోషిస్తుండగా గీతాఆర్ట్స్ 2 బ్యానర్‌పై బన్నీవాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకుడు. ఈ చిత్రం టీజర్ లాంచ్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు అనిల్ రావిపూడి అతిథిగా హాజరై మాట్లాడారు. 'పోలీసులను రాజకీయనాయకులు ఎలా వాడుకుంటున్నారనేదానిపైనే ఈ సినిమా ఉంటుంది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఇందులో ఉంటాయి. సంతృప్తినిచ్చిన కథ ఇది. యూనిట్ మొత్తానికి శుభాకాంక్షలు అందిస్తున్నా' అని అల్లు అరవింద్ అన్నారు. నేరస్తుల్ని పట్టుకోవాల్సిన పోలీసులే కేసులో ఇరుక్కొని కష్టాలు పడితే?అనే అంశాన్ని తీసుకొని తెరకెక్కించిన సినిమా ఇదని, అవకాశం ఇచ్చిన నిర్మాతలకు కృతజ్ఞతలని దర్శకుడు అన్నారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

# రెండువారాల్లో ఇంత మార్పా?

సారా ఆలీఖాన్.. అతి తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్‌ని దక్కించుకున్న క్రేజీ హీరోయిన్. సారా ఈ మధ్య ఓ భిన్నమైన ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఆ ఫొటో తనదే. యోగా మ్యాట్‌పై కూర్చుని బెల్లీ ఫ్యాట్‌ని చూపిస్తూ తాను దిగిన ఫొటో అది. ఆ ఫొటోని షేర్ చేసి, 'నిజంగా ఈ విషయంలో నేను చాలా ఇబ్బంది పడుతున్నాను. రీసెంట్ ఈవెంట్స్‌లో నా శరీర బరువు నన్ను చాలా ఇబ్బందులకు గురిచేసింది. ముఖ్యంగా నా బెల్లీ ఫ్యాట్. అది నాకు పెద్ద మైనస్. అందుకే దానిపై యుద్ధం ప్రకటించా' అంటూ వెంటనే మరో ఫొటో షేర్ చేసింది. తను బెల్లీ ఫ్యాట్‌ని కరిగించి స్లిమ్ అయిన ఫొటో అది. రెండు వారాల్లో ఇంత మార్పా? అంటూ నెటిజన్స్ ఆ ఫొటోలు చూసి షాక్‌కి గురవుతున్నారు. ఏది ఏమైనా సారా నేటి యువతరంలో గొప్ప స్ఫూర్తినే నింపింది.



సారా అలీఖాన్



# 'జవాన్'ను మించి..

రణబీర్‌కపూర్, రష్మిక మందన్న జంటగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'యానిమల్' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, పాటలకు అద్భుతమైన ఆదరణ లభిస్తున్నది. డిసెంబర్ 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఓ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. అమెరికాలో ఈ చిత్రాన్ని 888 స్క్రీన్స్‌లో విడుదల చేయబోతున్నారు. ఇప్పటివరకు యూస్‌లో విడుదలైన భారతీయ సినిమాల్లో అత్యధిక థియేటర్లను పొందబోతున్న చిత్రమిదేకావడం విశేషం. షారుఖ్‌ఖాన్ 'జవాన్' 810 థియేటర్లలో రిలీజ్ కాగా..'యానిమల్' ఆ రికార్డును అధిగమించడం విశేషం. అనిల్ కపూర్, బాబీ డియోల్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



హృతిక్‌శౌర్య

# గ్రామీణ నేపథ్యంలో 'అశ్వద్ధామ'

హృతిక్ శౌర్య, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అశ్వద్ధామ'. చంద్రశేఖర్ ఆజాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఫ్లిక్‌నైనా ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తున్నది. హీరో హృతిక్ శౌర్య పుట్టిన రోజు సందర్భంగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే లవ్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. కమర్షియల్ అంశాలతో ఆకట్టుకుంటుంది. వరలక్ష్మీ శరత్‌కుమార్ పాత్ర ప్రత్యేకంగా నిలుస్తుంది. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి' అని చిత్ర బృందం పేర్కొంది. చిత్రం శ్రీను, టెంపర్ వంశీ, మానిక్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె నాయుడు, సంగీతం: ప్రజ్వల్ కుమార్, కథ, మాటలు, దర్శకత్వం: చంద్రశేఖర్ ఆజాద్ పాటిబండ్ల.



కత్రినాకైఫ్

# వీరమహిళగా కనిపిస్తా

'టైగర్ 3'లో కత్రినాకైఫ్ చేసిన యాక్షన్ విన్యాసాలు సినిమా విడుదలకు ముందే చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా టవల్‌ని కట్టుకొని వేరే స్త్రీతో ఆమె చేస్తున్న పోరాటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై కత్రినా స్పందిస్తూ 'ఇందులో నేను జోయా అనే స్పైగా నటించాను. పాత్రోచితంగా యాక్షన్ సీన్స్ చెయ్యాలి. చాలా కష్టపడి ఇష్టంగా చేశాను. పురుషులతో సమానంగా పోరాడే వీరమహిళగా ఇందులో నన్ను చూస్తారు. ముఖ్యంగా ఇందులో నేను చేసిన టవల్ ఫైట్ బాగా వైరల్ అవుతుంది. ఆవిరులతో నిండిన గదిలో పోటాపోటీగా సాగే ఫైట్ ఇది. ఇద్దరు మహిళలు ఇలా నువ్వానేనా అని కొట్టుకోవడం ఇంతకు ముందు తెరపై ఎవరూ చూసుండరు. నవంబర్ 12న 'టైగర్ 3' రానుంది. నేను కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నా' అని చెప్పుకొచ్చింది కత్రినా.

